క్లుప్తంగా

మంత్రికి ఆహ్వానం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయం అనుదబందదేవాలయమైన శ్రీఆదిముక్తీశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభం పునఃప్రతిష్టాపన కార్యక్రమాన్ని డిసెంబర్‌లో నిర్వహించనున్నారు. కాగా, ఈ కార్యక్రమానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఈఓ మారుతి, అర్చక బృందం మంగళవారం పెద్దపల్లి జిల్లా మంథనిలో కలిసి ఆహ్వానించారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు పనకంటి ఫణీంద్రశర్మ, బైకుంఠపాండా ఉన్నారు.

విద్యార్థి ప్రతిభ



చిట్యాల: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలలో మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనమిదవ తరగతి విద్యార్థి కొటం అభిలాష్ షాట్‌పుట్, సింగల్ కార్యమ్‌లో జిల్లా ప్రథమ స్థానంలో గెలుపొందాడు. ఈ సందర్భంగా అభిలాష్‌ను ప్రధానోపాధ్యాయుడు గిరగాని కృష్ణ అభినందించాడు. డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా అభిలాష్ బహుమతుల అందుకోనున్నట్లు తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

చిట్యాల: వరంగల్‌లో డిసెంబర్ 6న నిర్వహించే జనసభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో జనసభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, శంకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన జూకంటి రాజన్న (41) కడుపు నొప్పి భరించలేక సోమవారం పురుగుల మందును తాగాడు. కాగా, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

స్వెటర్లకు భలే గిరాకీ..

- పెరిగిన చలి తీవ్రత
- దుప్పట్లు, స్వెటర్లతో రక్షణ పొందుతున్న ప్రజలు



టేకుమట్లలో ఏర్పాటు చేసిన స్వెటర్ల షాపు వద్ద ప్రజలు

టేకుమట్ల: చలికాలం ప్రారంభంలోనే ప్రజలు సాయంత్రం అయితే బయటికి రాలేక ఇంటికే పరిమితమవుతున్నారు. వాతావరణం చల్లబడి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పగలు సైతం ఎండలోనే ఉండేందుకు ఇష్టపడుతున్నారు. ఇక వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఉదయం 7గంటల వరకు పొగమంచు నిండుకోవడంతో బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం సైతం 5గంటల నుంచే చలి తీవ్రత పెరడగంతో ప్రధాన రోడ్ల వెంట రాత్రి ఎనిమిది వరకే ఎవరూ ఉండట్లేదు. చలి తీవ్రత పెరుగుతుండడంతో మండలంలోని ప్రజలు స్వెటర్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో షాపుల్లో స్వెటర్లు, రగ్గులకు గిరాకీ పెరిగింది. చలికాలం మొదట్లోనే ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ప్రధాన కూడళ్లలో, ప్రధాన రోడ్ల వెంట రగ్గుల దుకాణాలను ఏర్పాటు చేసుకుని విక్రయిస్తుంటారు. ఎక్కువగా చలికాలంలో నేపాల్ రాష్ట్రానికి చెందిన దస్తులు ప్రసిద్ధం కావడంతో నేపాల్ వ్యాపారస్తులు పలు చోట్ల స్టాళ్లను ఏర్పాటు చేసుకుని వ్యాపారం కొనసాగిస్తుంటారు. ఇక ప్రయాణ సమయంలో చేతులకు గ్లౌజులతో పాటు, మంకీ క్యాప్, స్వెటర్ తప్పనిసరిగా వేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

గిరాకీ పెరిగింది..



20 రోజుల క్రితం టేకుమట్లలో స్వెటర్లు, రగ్గుల దుకాణాన్ని ఏర్పాటు చేశా. చలితీవ్రత పెరగడంతో గిరాకీ పెరిగింది. అన్ని రకాల చలికాల దుస్తులు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం దాదాపు మూడు నెలలు షాపును ఏర్పాటు చేస్తా.

– గోకుల్ గరాసియా, ఉత్తరప్రదేశ్ స్టాల్ నిర్వాహకుడు

తప్పనిసరిగా స్వెటర్ ధరిస్తున్నా..



విధుల్లో భాగంగా రాత్రి వేళల్లో తిరగాల్సి ఉంటుంది కావున చలి తీవ్రత పెరడంతో తప్పనిసరిగా స్వెటర్ వేసుకుంటున్నా. హెల్మెట్, స్వెటర్, చేతులకు గ్లౌజులు ధరించి బండిపై ప్రయాణిస్తున్నా. ప్రతీ ఒక్కరు చలి నుంచి రక్షణ పొందేందుకు స్వెటర్ ధరించాలి.

– మల్లన్న, హెడ్ కానిస్టేబుల్, టేకుమట్ల

పోలీసులు అంకితభావంతో పనిచేయాలి

- డీఎస్పీ సంపత్‌రావు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల: పోలీసులు అంకితభావంతో పని చేయాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్కిల్ ఆఫీస్, పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో ఎక్కువగా నమోదు అయ్యే కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, మహిళల సమస్యలపై తక్షణమే స్పందించాలని అన్నారు. నేరాల నియంత్రణ కోసం పోలీస్‌లు పెట్రోలింగ్ చేయాలని అన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్య తలేత్తే సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. నేర నియంత్రణలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అందుకు అనుగుణంగా ప్రజలకు అవగాహన కల్పించి వాటి ప్రయోజనాలను తెలుపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావన్‌కుమార్, సెకండ్ ఎస్సై ఎండీ.శాఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి

- డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి



రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, అధికారులు

కాటారం: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్, రవాణా, టీజీఎండీసీ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారుల సమిష్టి కృషి ఎంతో అవసరం అని డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయా శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై ఆయా శాఖల అధికారులతో కలిసి చర్చించారు. అనంతరం కాటారం, మహదేవపూర్ పరిధిలో జాతీయ రహదారిని పరిశీలించారు. ప్రమాద స్థలాలు, మలుపుల వద్ద ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, ఇసుక లారీల పార్కింగ్ ఎక్కడ ఉంటే అంతరాయం లేకుండా ఉంటుందనే విషయాలను క్షుణ్ణంగా ఆరా తీశారు. ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో తీసుకోవాల్సిన ప్రమాదాల నియంత్రణ చర్యల గూర్చి వివరించారు. ప్రమాద రహిత జాతీయ రహదారిగా తీర్చిదిద్దడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం, మహదేవపూర్ సీఐలు నాగార్జున రావు, రాంచంద్రారావు, డీటీఓ సంధాని, ఎస్సై మ్యాక అభినవ్, ఆర్‌అండ్‌బీ ఏఈ అవినాశ్, పీఆర్ ఏఈ రవీందర్, ఎంపీఓ వీరస్వామి, టీజీఎండీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వాలు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం పట్టణంలో ప్రారంభించినట్లు పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కాకతీయ కాలనీలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సభ్యత్వాలను అందజేశారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఉందన్నారు. 99 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఈ డిసెంబర్‌తో వంద సంవత్సరాల్లోకి అడుగుపెడుతుందని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయకాలనీ శాఖ కార్యదర్శి కన్నూరి మహేష్, నాయకులు జోసెఫ్, వైకుంఠం, రాజ్‌కుమార్, దుర్గం పుష్పలత, సరిత, రాజేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాతృమూర్తి పూజలు



పూజలు చేస్తున్న జయమ్మ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని కార్తీకమాసం సందర్భంగా రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాతృమూర్తి జయమ్మ దర్శించుకున్నారు. మంగళవారం ఆమె ఆలయానికి రాగా ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో ద్విలింగాలకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. శ్రీశుభానందదేవి అమ్మవారికి పూజలు చేశారు. అక్కడ అర్చకులు ఆమెను ప్రత్యేక పట్టువస్త్రాలతో సన్మానించారు.

డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బీఎం నరసింహారావు

మొగుళ్లపల్లి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మొట్లపల్లిశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిచారు. ఈ సందర్భంగా బీఎం నరసింహారావు మాట్లాడుతూ.. పట్టాదార్ పాస్ పుస్తకం కలిగి ఉన్న రైతులకు పంటరుణాలు, రైతు నేస్తం పథకం కింద బంగారు అభరణాలపై రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్లపై అధిక వడ్డీ అందిస్తున్నట్లు వివరించారు. సైబర్ మోసాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, సుకన్య యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రంజిత్‌కుమార్, అనిల్ పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

కాళేశ్వరం: యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లిలో ఈనెల 19న నిరుపేద ఆదివాసీ ఎరుకల కుటుంబానికి చెందిన వారి గుడిసెను ప్రొక్లెయినర్‌తో కూల్చిన వారిపై చర్య తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్యాల రాము మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూతాటి ప్రేమలత, యాదగిరిలు ఉండే గుడిసెలను కూల్చడమే కాక గాయపరిచిన వారిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అశోక్

కాటారం: మండలంలోని శంకరాంపల్లికి చెందిన బిస్కుల రమేశ్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో పెద్ద ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించగా రమేశ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. దీంతో స్పందించిన గ్రామ యువత, అతడి మిత్రులు రూ.12 వేలు విరాళాలు సేకరించగా మంగళవారం మాజీ సర్పంచ్ అంగజాల అశోక్ కుమార్ ద్వారా బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి తన కుమారుడి వైద్య ఖర్చులకు సహకారం అందించి ఆదుకోవాలని రమేశ్ తల్లి సమ్మక్క ఈ సందర్భంగా వేడుకుంది.

జీపీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ నిర్వహిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పలిమెల: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంగళవారం ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు. అనంతరం గ్రామంలో భారత రాజ్యాంగ దివస్ సందర్భంగా ప్రత్యేక గ్రామసభ నిర్వహించి రాజ్యాంగ ప్రవేశిక చదివి వినిపించి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ సాయిల్, ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ రవీందర్, ఏపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ఏఎస్ఎం పద్మ, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, కిష్టబాయ్, గ్రామస్తులు దందర రాజేందర్, గందర సురేష్, జనగామ దుర్గయ్య, మాంతయ్య, జీపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బాలు

కాటారం: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో కాటారం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల హ్యాండ్ బాల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 24న సిరిసిల్లలో నిర్వహించిన జూనియర్స్, అండర్–19 హ్యాండ్ బాల్ విభాగంలో విద్యార్థులు అత్యంత ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో విద్యార్థులను ప్రిన్సిపాల్ బాలు, ఉమ్మడి కరీంనగర్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్, ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

రేగొండ: విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు పే స్కేలు అమలు చేయాలని మండల కేంద్రంలోని వనరుల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు సహదేవ్, లక్ష్మణ్, స్వర్ణలత, కోటేశ్వర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

రేగొండ: మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన గువ్వ మొగిళి, రేపాకపల్లి గ్రామానికి చెందిన రంగా మోహన్ రెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, మాజీ సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల గ్రామంలోని ఆదర్శ పాఠశాల, కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో మండల వైద్యాధికారి డాక్టర్ నాగారాణి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 68మంది, ఆదర్శపాఠశాలలో 42మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇద్దరు జ్వర పీడితులను గుర్తించి రక్తనమూనాలు తీసి ల్యాబ్‌కు పంపారు. ప్రిన్సిపాల్ రాకేశ్, ఎస్ఓ శైలజ, వైద్యసిబ్బంది సునీత, బిక్షపతి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

కాటారం: అఖిల భారత యాదవ సంఘం ధర్మాసాగర్ గ్రామ నూతన కమిటీని మంగళవారం డివిజన్ హడక్ కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కల్కి కొమురయ్య, అధ్యక్షుడిగా సిద్ది శంకరయ్య, ఉపాధ్యక్షుడిగా కటవేని లింగన్న, ప్రధాన కార్యదర్శిగా పర్వవేన రాజయ్య, కోశాధికారిగా సిద్ది మనోజ్, సహకార్యదర్శిగా కల్కి సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా గంగుల సతీష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు హడక్ కమిటీ సభ్యులు ఎన్నిక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ హడక్ కమిటీ సభ్యులు గడ్డం చంద్రయ్యయాదవ్, అబ్బినవేని ఐలయ్యయాదవ్, గడవేన దేవేందర్‌యాదవ్, మొగిలి రాజ్‌కుమార్‌యాదవ్, ఆత్మకూరి కుమార్ యాదవ్, తొట్ల శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి సన్మానం



సిబ్బందిని సన్మానిస్తున్న కార్యదర్శి రాజు

మల్హర్: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీలో మూడు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీ సిబ్బందిని మంగళవారం గ్రామ కార్యదర్శి చెలకల రాజుయాదవ్ సత్కరించారు. ఉత్తమ ఉపాధి వాచర్‌గా ఎండీ ఇబ్రహీం, గ్రామ పంచాయతీ ఉత్తమ సిబ్బందిగా కాల్వ పోశాలు, ఉపాధిహామీలో వంద రోజులు పూర్తిచేసిన కూలీగా రాజయ్యను శాలువాలతో సత్కరించినట్లు కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో కారోబార్ అజ్మత్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో, కార్యాలయాల్లో, అధికారుల, పలు సంఘాల, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేశారు. ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని పాటించాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ చేరాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మొగుళ్లపల్లి: ర్యాజ్యాంగ ఆమోద దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



మొగుళ్లపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి సునీత



కాటారం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు, యువకులు



గణపురం: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీపీపీ సీఈ శ్రీ ప్రకాశ్



చిట్యాల: ప్రభుత్వ కళాశాలలో..



చిట్యాల: కేక్ కట్ చేస్తున్న అధికారులు



టేకుమట్లలో..



భూపాలపల్లి రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో..



భూపాలపల్లి రూరల్: ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..